# సాఫ్ట్ లోకం

-వివినమూర్తి

1

**2001** ఫిబ్రవరి

సరిత ఇంటికి వచ్చేసరికి పదకొండు. లిఫ్ట్‌లోనే నిద్ర. ఎలాగో లోపలికి వెళ్లింది.

ప్రసాద్ గాఢ నిద్రలో ఉన్నాడు. డైనింగ్ టేబుల్ మీద చీటీ. 'వంట చేసి ఉంచాను. ప్లీజ్ తిను. ఈ రోజు చెడ్డ రోజు. నథింగ్ హేపెండ్ యాజ్ ప్లాన్డ్.'

సరిత లైటు ఆర్పి మంచం ఎక్కింది.

2

టీ తాగుతూ ఇన్‌బాక్స్ తెరిచింది.


ప్రసాద్ నుంచి మెసేజ్.

'సాయంత్రం ఫ్లయిట్‌కి సింగపూర్ వెళ్తున్నాను.'

కాన్ఫరెన్స్ హడావుడిలో ఉంది సరిత. డెడ్‌లైన్స్ చర్చ. అది అయ్యేసరికి రాత్రి తొమ్మిదయింది.

సరిత ఆఫీసు వదిలేసరికి ఆ రోజు పది దాటింది.

బెంగుళూరు ఒకప్పుడు తొందరగా



పడుకునేది. అప్పుడు గ్లోబలైజేషన్ డబ్బులూ, సుఖాలూ బెంగుళూరుకి తెలియవు. ఇప్పుడు పిజా కార్నర్లూ... బార్లూ... దీపాలతో రాత్రిని పగలుగా... చీకటిని వెలుతురుగా చూపిస్తున్నాయి.

ఈ రాత్రి కూడా కార్లు బారులు.

నాలుగైదేళ్లలో ఎన్ని మార్పులు.

సరిత ఇంటికి చేరి ప్రసాద్ కోసం ఎదురు చూసింది.

లక్కీగా గుర్తొచ్చింది - మెసేజ్.

ప్రాణం ఉసూరుమంది.

ఫ్రిజ్‌లో బ్రెడ్ ముక్కలున్నాయి. జాం రాసుకుతింది.

3

పదకొండున్నర ప్రాంతంలో ఫోన్.

ఆగిపోతుందేమోనని నిద్రమత్తులో ఊరుకుంది. ఆగింది కానీ తిరిగి మొదలయింది.

ఫోన్ చేసే వాళ్లెవరబ్బా అనుకుంది.

చెల్లా?

చటుక్కున ఫోన్ తీసింది. లతే!

పెళ్లిట. పద్మకి.

పద్దెనిమిదేళ్ల పద్మకి పెళ్లేంటే - మతి పోయిందా - చెడామడా తిట్టింది.

లత ఏదేదో చెపుతోంది - తన ఖర్మట - మొగుడు వినిపించుకోడట - పత్తి దిగుబడి

బాగుంటుందనుకుంటున్నారుట. ధర పలుకుతుందని తలపెట్టారుట. అందుకనిట పెళ్లి.

ఏడుపు.

నిద్రమత్తొదిలిపోయింది.

ఏడవకే – అంటోంది సరిత.

'ఏడుపు తర్వాత – ఫోన్ తిరిగిపోతోంది – విషయం చెప్పు'– అత్తయ్య కాబోలు అంటోంది.

'అత్తయ్యకియ్యవే' అంది సరిత.

'వొద్దులే' – లత గొంతులో మొహమాటం.

'చెప్పు' – అంది.

'నువ్వూ ఈ పెళ్లికి ఏమైనా ఓ పాతిక వేలు సర్దాలి.

సర్ద...గలవా...' – నసుగుతోంది లత.

లత ఎంత అభిమానవంతురాలో సరితకి బాగా తెలుసు.

'రేపే డీడీ పంపుతాను' అంది సరిత.

గద్గద స్వరంతో ఏదో అంటుంటే ఫోన్ కట్టయిపోయింది.

లత గొంతుని టెలిఫోను బిల్లు మూసేసింది కాబోలు... అనుకుంది.


ఆ రాత్రి సరితకి నిద్రపట్టలేదు.

4

గుంటూరు దగ్గర చిన్న పల్లెటూరు వాళ్లది. తనకి ఎనిమిదో ఏడూ, లతకి ఆరో ఏడూ నడుస్తూండగా తండ్రి చనిపోయాడు. మూడెకరాల భూమీ, ఇల్లూ, పదిహేను వేల అప్పూ... ఇద్దరు ఆడపిల్లలు... పాతికేళ్ల వయసూ... ఉమ్మడి కుటుంబాలు చితికిపోతున్న రోజులు... పక్క వాటాలోనే ఉంటున్న మరిది... ఏం జరిగిందో పూర్తిగా తెలియదు. తల్లి ఆత్మహత్య చేసుకుంది. పదకొండేళ్ల వయసున్న తనని హైదరాబాదులో ఉండే పిన్నమ్మ పెంచుకుంటానంది. దాంతో తన జీవితమే మారిపోయింది. లత గురించి ఎంత బెంగ – ఎంత ఏడ్చింది – కొత్తలో కొన్నాళ్లు.

లతని మేనత్త చేరదీసింది.

'ఎందుకు చేరదీయదూ? నా అక్కనీ, దాని భూమినీ పొట్టన పెట్టుకుందిగా'– అనేది పిన్నమ్మ. ఆవిడ స్కూలు టీచరు. ఎందుకనో పెళ్లి చేసుకోలేదు. లత, తనూ అక్క కూతుళ్లే అయినా పిన్నమ్మ దానికి ఏ సహాయమూ చెయ్యలేదు. చదువు చెప్పించలేదు. సహాయం చేయదలచుకుంటే ఇద్దరికీ చెయ్యాలి గదా! లేదు– పెంచుకుంది గనక తనే కూతురు. లత కాదు. తనకి ఇందులో పెద్ద అసంబద్ధత కనిపించేది. బెంగుళూరులో రామయ్య కాలేజీలో బీయీలో చేరేసరికి దాని పెళ్లి అయిపోయింది. కొడుక్కి చేసుకుంది మేనత్త. పదెకరాల భూమి, పాతకాలం ఇల్లూ... ఒకప్పటి లెక్కల్లో స్థితిమంతులే. అప్పుడు వ్యవసాయంలో ఆదాయం బాగా ఉండేదిట. ఇప్పుడేమయిందీ తెలియదు – రైతుల అప్పులు పెరిగిపోయాయిట – ఆత్మహత్యలు చేసుకుంటున్నారుట... ఎందుకు పెరగవూ? మద్యపాన నిషేధం తీసేశారు. ఎక్కడలేని డబ్బూ తాగటానికే చాలటం లేదు.



అప్పులూ... ఆత్మహత్యలూ పెరగక ఏమవుతుంది!

పోనీ లత మొగుడు తాగుబోతూ కాదు, ఎలాంటి ఖర్చు మనిషీ కాదు. ఎప్పుడు చూసినా పొలం పొలం పొలం... అయినా ఎందుకు అప్పులు చేస్తున్నట్టు? ధరలు పడిపోతున్నాయిట. పడడం మంచిదేగదా... ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పడటం లేదా! ఆఖరికి ఐటీ షేర్లూ పడిపోవటం లేదూ... అంతలా ఫుడ్ వస్తువుల ధరలు తగ్గుతున్నాయా? లేదే. ఫుడ్ వరల్డ్‌లో ప్రతీదీ ఖరీదే. పిన్నమ్మ చెబుతూంటుంది. 'నువ్వు పిచ్చిదానివి... డబ్బులుంటే ప్రతీ వాళ్ల కళ్లూ నీ మీదే ఉంటాయి. ప్రతీ వాళ్లకీ రకరకాల కష్టాలు వచ్చేస్తాయి...'

ఆ మాట నమ్మేసేదేమో. ఏదో అదృష్టం బాగుంది. సాఫ్ట్‌వేర్ ఫీల్డులో కాస్తంత బాగానే డబ్బులు దొరుకుతున్నాయి. లేకపోతే తనకీ డబ్బు పిచ్చి పట్టేదేమో. ఇంత లిబరల్‌గా ఉండేది కాదేమో!

ఇంతకీ పిన్నమ్మ మాటలు ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చాయి?

ఛ...ఛ... లత అలాంటి మనిషి కాదు.

దానికి నిజంగానే అవసరం పడింది. లేకుంటే అడగదు.

'పొద్దుటే డీడీ సంగతి చూడాలి'.

నిద్ర...

5

ఆ పొద్దుట వచ్చింది... వెళ్లింది.

మధ్యలో ఓ మారు గుర్తొచ్చింది. డ్రాఫ్ట్ కోసం డైల్ చేద్దామనుకుంది.

పని. పని. పని.

ఆ రాత్రి వచ్చింది. పన్నెండు గంటల సమయంలో పడుకోబోతుండగా గుర్తొచ్చింది.

నిద్ర. నిద్ర. నిద్ర.

మర్నాడు ప్రసాద్ నుంచి మెసేజ్. 'ఏడు గంటల ఫ్లయిట్‌కి వస్తున్నాడట.'

వెంటనే రిప్లయ్ చేసింది.

'మనం లతకి డీడీ పంపాలి. పొద్దుట గుర్తు చెయ్యి'.

ప్రసాద్‌కి రోజూ పొద్దుటే మెయిల్ చూసే తీరిక ఉంటుందని సరిత అంచనా. ఆ రాత్రి వచ్చింది. ప్రసాద్ ఫ్లయిట్ గంట లేటు. ఇద్దరికీ మాట్లాడుకోటానికే అవలేదు. ఆ పొద్దుట వచ్చింది. ఎక్సర్‌సైజులూ, వంటా, పని స్థలానికి పరుగు.

ఆ మధ్యాహ్నం ఇంటికి వచ్చింది సరిత. వస్తూనే గుడ్డలు పెట్టెలో పడేసింది. పడేస్తూనే మెయిల్ బాక్స్ తెరిచింది. తెరుస్తూనే 'ప్రసీ. అయామ్ వెరీ హేపీ. హేడ్ ఛాన్స్ టు స్కోర్ ఓవర్ షినాయ్, నాలుగ్గంటల ఫ్లయిట్‌కి కేంటక్కి వెళ్తున్నాను. విల్ బీ బాక్ ఇన్ త్రీ డేస్' అని మెసేజ్ చేసింది.

డోర్ లాక్ చేస్తుండగా లత గుర్తొచ్చింది.

తనని తను తిట్టుకుంటూ తలుపు తీసి లోపలికి వచ్చింది.

పెన్ను. పెన్ను. పెన్ను.

గొప్ప దుఃఖం వచ్చింది.

ఫ్లయిట్ మిస్సయినా సరే... నా డ్యూటీ మర్చిపోను అనుకుంది గట్టిగా.

కంప్యూటరు... ఔట్‌లుక్ ఎక్స్‌ప్రెస్... తెరిచింది.

'లతకి రేపే పాతిక వేలు డీడీ పంపు'. మెసేజ్ టైప్ చేసింది.

సెండ్ బటన్ నొక్కటం మర్చిపోయింది.

ఫ్లయిట్‌లో కూర్చున్న సరిత మనసు అన్ని విధాలా ఆనందంగా ఉంది.

'షినాయ్. అయామ్ ద విన్నర్. లతా... ఐ లవ్ యూ...'

6

2001 మే.

సైకియాట్రిక్ కన్సల్టింగ్ రూంలో సరిత చెపుతోంది.

ఏడుస్తోంది.

'డాక్టర్... నేనే లత మొగుడిచేత ఎండ్రిన్ తాగించాను... అయామ్ ద కిల్లర్.'

ఆమె కౌన్సిలింగ్ పూర్తవటం కోసం బయట కాచుకుని ఉన్న ప్రసాద్ - ఫ్లయిట్ మిస్సవుతుందేమోనని మాటిమాటికీ టైమ్ చూసుకుంటున్నాడు.

*

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004. Chief Editor : I. Venkata Rao.